సాక్షి
ప్రకాశం
మంగళవారం । 4 । జూన్‌ । 2024



కౌంటింగ్‌ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండండి

సార్వత్రిక ఎన్నికల్లో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదిమూలపు సురేష్‌ సూచించారు.

- 8లో..



కౌంటింగ్‌ డ్రై రన్‌

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ కేంద్రాల్లో సోమవారం ఓట్ల లెక్కింపు డ్రై రన్‌ నిర్వహించారు. కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌, ఎస్పీ ఆదేశించారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.5/24.7

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్‌

శాంతియుత కౌంటింగ్‌కు సహకరించండి

- బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేష్‌



బాలినేని శ్రీనివాసరెడ్డి



డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌

ఒంగోలు/కొండపి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ శాంతియుతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, కౌంటింగ్‌ విధులకు హాజరయ్యేవారు సంయమనం పాటించాలన్నారు. ఏదైనా సమస్య వస్తే దానిని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నా సంయమనం వీడరాదని సూచించారు. శాంతియుతంగా కౌంటింగ్‌ ప్రక్రియ నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులకు, ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.331

ఒంగోలు సెంట్రల్‌: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో 67వ రోజు సోమవారం జరిగిన వేలంలో 4383 బేళ్ల వ్యాపారులు కొనుగోలు చేసినట్లు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. కేజీ పొగాకు ధర గరిష్టంగా రూ.331 కాగా, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.287.86 వచ్చినట్లు చెప్పారు. జిల్లాలోని ఆయా కేంద్రాల్లో రైతుల నుంచి 4873 బేళ్లు రాగా, 4383 బేళ్లు కొనుగోలయ్యాయి. 490 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. 67 రోజుల పాటు జరిగిన వేలంలో ఇప్పటి వరకు 2,42,101 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారన్నారు.

పూసలపాడులో రాష్ట్ర స్థాయి బండ పందెం

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడులో అభయాంజనేయస్వామి వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 7వ తేదీ రాష్ట్రస్థాయి బండ పందెం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరు పళ్లసైజ్‌ విభాగంలో బండ పందెం నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండోవ, మూడోవ, నాల్గోవ, ఐదోవ బహుమతులుగా వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను దాతలు అందజేస్తారన్నారు. పూర్తి వివరాలకు ఫోన్‌ నెంబర్లు 9182225180, 7013864288 సంప్రదించాలని కోరారు.

కౌంటింగ్‌ టైం..

గెలుపు వాకిట్లో..

ప్రజాతీర్పు వెలువడేందుకు కొద్ది గంటలే సమయం మిగిలింది. మే 13వ తేదీన పోలింగ్‌ ముగిసింది. జిల్లాలో భారీ ఎత్తున 87.24 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈవీఎంలలో తమ తీర్పును నిక్షిప్తం చేశారు. 21 రోజుల నిరీక్షణకు నేటితో తెరపడనుంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం అన్ని వర్గాల వారు నరాలు తెగే తీవ్ర ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. కౌంటింగ్‌ ప్రక్రియకు వందల సంఖ్యలో ప్రభుత్వ సిబ్బంది, పోలీసు యంత్రాంగం సన్నద్ధం కాగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల రణరంగంలో నిలిచిన అభ్యర్థులతో పాటు వేల సంఖ్యలో రాజకీయ పార్టీల కార్యకర్తలు ఫలితాల కోసం క్షణం ఒక యుగంగా గడుపుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా రాజకీయ పార్టీల గెలుపోటములపై విస్తృతంగా చర్చలు సాగుతున్నాయి. దారులన్నీ కౌంటింగ్‌ కేంద్రం రైజ్‌ కాలేజీ వైపే. అందరి చూపు అటే.



కౌంటింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ దినేష్‌ కుమార్‌, ఎస్పీ సుమిత్‌ సునీల్‌



కౌంటింగ్‌ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సెక్యూరిటీ చెకింగ్‌ పాయింట్‌

- జిల్లాలో ఓటర్లు 18,22,470 మంది
- పోలైన ఓట్లు 15,89,866 మంది
- పురుషులు 7,94,224 మంది
- మహిళలు 7,95,566 మంది
- ఇతరులు 76 మంది
- పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లు 21,782
- పోలింగ్‌ శాతం 87.24

- 21 రోజుల ఉత్కంఠకు నేడు తెర
- తెరుచుకోనున్న ఈవీఎంలు
- టెన్షన్‌..టెన్షన్‌లో అభ్యర్థులు
- గెలుపుపై బలమైన విశ్వాసంతో వైఎస్సార్‌ సీపీ
- రైజ్‌ కాలేజ్‌లోనే అన్నీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు
- జిల్లా మొత్తం 144 సెక్షన్‌ అమలు
- కిటకిటలాడుతున్న ఒంగోలు

ఒంగోలు పార్లమెంట్‌కు 25 మంది అభ్యర్థులు
8 అసెంబ్లీకి 140 మంది
పోలింగ్‌ కేంద్రాలు: 2183

- ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం
- తొలుత పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లు
- మధ్యాహ్నం 2 గంటల తర్వాత మొదటి ఫలితం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సార్వత్రిక ఎన్నికల సమరం చివరి అంకానికి చేరుకుంది. ఎన్నికల రణరంగంలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. విజేతలెవరు, పరాజితులు ఎవరు, ఎవరికి ఎంత మెజార్టీ వచ్చింది. మహిళలు, రైతులు, యువత ఎవరికి పట్టం గట్టారు. ఏ నియోజకవర్గంలో ఫలితం ఎవరివైపు మొగ్గు చూపింది. అధిక మెజార్టీ వచ్చే మండలాలు, గ్రామాలు, ఎవరు వెన్నుపోట్లు పొడిచారు..ఇలాంటి అన్ని ప్రశ్నలకు మంగళవారం మధ్యాహ్నానికి స్పష్టత రానుంది. ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో గెలుపుపై విశ్వాసం వ్యక్తం చేస్తోంది. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి తమను విజయపథానికి తీసుకుపోతుందని ఆ పార్టీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నంతకాలం జిల్లాను అన్ని రంగాల్లో విస్మరించిన తెలుగుదేశం పార్టీకి మరోసారి నిరాశే మిగలనుంది. గత ఎన్నికల్లో 86.04 ఓట్లు పోలవగా ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాలను వైఎస్సార్‌ సీపీ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో కూడా రాష్ట్రంలోనే అత్యధికంగా భారీ ఎత్తున 87.24 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెరిగిన పోలింగ్‌ శాతంతో గతం కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని అధికార పార్టీ నేతల్లో విశ్వాసం రెట్టింపైంది. మే 13వ తేదీన పోలింగ్‌ ముగిసిన తర్వాత పార్లమెంట్‌, అసెంబ్లీలకు సంబంధించిన ఈవీఎంలను ఒంగోలు నగర శివారులోని రైజ్‌ ఇంజినీరింగ్‌ కళాశాలకు చేర్చారు. 21 రోజుల పాటు వాటిని భారీ భద్రత నడుమ స్ట్రాంగ్‌ రూముల్లో ఉంచారు. ఉదయం 8 గంటల నుంచి పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లను లెక్కించడం ప్రారంభిస్తారు. అనంతరం దానికి సమాంతరంగా ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాతే మొదటి ఫలితం విడుదల కానుంది. ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో ఎక్కడా గొడవలు జరగకుండా 144 సెక్షన్‌ పక్కాగా అమలు చేస్తున్నారు.



కౌంటింగ్‌ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్‌ దినేష్‌ కుమార్‌



సిబ్బందిని తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ

అందరి చూపు రైజ్‌ కాలేజీ వైపే..

ఓట్ల లెక్కింపు కోసం జిల్లాలోని అన్నీ నియోజకవర్గాలకు రైజ్‌ కాలేజిలో మూడు భవనాల్లో 25 కౌంటింగ్‌ గదులను ఏర్పాటు చేశారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, పార్లమెంట్‌ సెగ్మెంట్‌కు 14 టేబుళ్లు చొప్పున ఒక్కో గదికి మొత్తం 24 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు 5 టేబుళ్లు, పార్లమెంట్‌ సెగ్మెంట్‌కు 40 టేబుళ్లు ఏర్పాటు చేశారు. అయితే పోస్టల్‌ బ్యాలెట్‌, ఈవీఎం ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తర్వాత మాత్రమే ఫలితాలను ప్రకటిస్తారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు ఒక రౌండ్‌కు సుమారు 30 నిమిషాల సమయం పడితే, పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్ల లెక్కింపు ఒక రౌండుకు సుమారు 3 నుంచి 4 గంటల సమయం పడుతుంది. జిల్లాలో ఇప్పటికి పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా 21,782 ఓట్లు ఉన్నాయి. అందులో సోమవారం సాయంత్రానికి సర్వీసు ఓట్లు 3,495 నమోదయ్యాయి. కనిష్టంగా 19 రౌండ్ల నుంచి గరిష్టంగా 21 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 297 పోలింగ్‌ కేంద్రాలు ఉండడంతో ఈ నియోజకవర్గానికి సుమారు 21 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదే విధంగా యర్రగొండపాలెం 265 పోలింగ్‌ కేంద్రాలకు 19 రౌండ్లు, దర్శి 282 పోలింగ్‌ కేంద్రాలకు 20 రౌండ్లు, సంతనూతలపాడు 256 పోలింగ్‌ కేంద్రాలకు 19 రౌండ్లు, ఒంగోలు 259 పోలింగ్‌ కేంద్రాలకు 19 రౌండ్లు, కొండపి 283 పోలింగ్‌ కేంద్రాలకు 20 రౌండ్లు, మార్కాపురం 257 పోలింగ్‌ కేంద్రాలకు 18 రౌండ్లు, గిద్దలూరు 284 పోలింగ్‌ కేంద్రాలకు 20 రౌండ్ల లెక్కన ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్‌ ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం 8 నియోజకవర్గాలకు 8 మంది పరిశీలకులను నియమించింది. వీరితో పాటు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ దినేష్‌కుమార్‌, నియోజకవర్గాల రిటర్నింగ్‌ అధికారులు, 338 మంది మైక్రో అబ్జర్వర్‌, కౌంటింగ్‌ అసిస్టెంట్‌, టేబుల్‌ ఇన్‌చార్జ్‌లతో పాటు అభ్యర్థులు ఆయా పార్టీల ఏజెంట్లు ఉంటారు.

నియోజకవర్గం	పోలింగ్‌ కేంద్రాలు	రౌండ్లు	పోటీలో ఉన్న అభ్యర్థులు
యర్రగొండపాలెం	265	19	14
దర్శి	282	21	11
సంతనూతలపాడు	256	19	14
ఒంగోలు	259	19	26
కొండపి	283	21	15
మార్కాపురం	257	19	27
గిద్దలూరు	284	21	21
కనిగిరి	297	22	12

బరిలో 165 మంది అభ్యర్థులు


సార్వత్రిక ఎన్నికల బరిలో 165 మంది అభ్యర్థులు నిలిచారు. ఒంగోలు పార్లమెంట్‌ 25 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో బాపట్ల పార్లమెంట్‌ పరిధిలోని సంతనూతలపాడు కూడా జిల్లా పరిధిలోనే ఉంది. అసెంబ్లీలకు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు, ఇతర పార్టీలు, స్వతంత్రులు మొత్తం 140 మంది అభ్యర్థులు రణరంగంలో పోటీ పడుతున్నారు. అధికార వైఎస్సార్‌ సీపీ నుంచి ఒంగోలు పార్లమెంట్‌ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించి ఒంగోలు అభ్యర్థిగా బాలినేని శ్రీనివాసరెడ్డి, కొండపి నుంచి ఆదిమూలపు సురేష్‌, సంతనూతలపాడుకు మేరుగు నాగార్జున, మార్కాపురానికి అన్నా రాంబాబు, గిద్దలూరుకు కుందురు నాగార్జున రెడ్డి, దర్శికి బూచేపల్లి శివప్రసాద్‌ రెడ్డి, కనిగిరికి దద్దాల నారాయణ యాదవ్‌, యర్రగొండపాలేనికి తాటిపర్తి చంద్రశేఖర్‌ పోటీలో ఉన్నారు.

ట్రాఫిక్‌ మళ్లింపు




హైవేపై ట్రాఫిక్‌ మళ్లిస్తున్న పోలీసులు

కౌంటింగ్‌ ప్రక్రియ నిర్వహించే రైజ్‌ కాలేజీ వద్ద ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జాతీయ రాహదారిపై వెళ్లే వాహనాలకు ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తకుండా కాలేజి వైపు రోడ్డును మూసి వేసి ఒక రోడ్డులోనే రాకపోకలు జరిగేలా ట్రాఫిక్‌ను మళ్లించారు. అంతేకాకుండా కౌంటింగ్‌ ఎన్నికల సంఘం గుర్తింపు కార్డుతో హాజరయ్యే కౌంటింగ్‌ సిబ్బంది, ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్‌ ఏజెంట్‌లు, మీడియా తదితరుల కోసం వివిధ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌ ఏర్పాటు చేశారు. ఒంగోలు వైపు నుంచి వెళ్లే వారి కోసం వల్లూరు వద్ద, నెల్లూరు వైపు నుంచి వచ్చే వారి కోసం రైజ్‌ కాలేజి దక్షిణం వైపు ప్రత్యేక పార్కింగ్‌లు ఏర్పాటు చేశారు. పార్కింగ్‌ ప్రాంతం నుంచి కౌంటింగ్‌ ప్రాంగణం వరకు చేరవేసేలా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌ గదుల నుంచి కాలేజి ప్రధాన గేట్ల వరకు మూడంచెల్లో భద్రత ఏర్పాటు చేశారు. ఎటువంటి ఆయుధాలు, మత్తు పదార్థాలు వంటివి ప్రాంగణంలోకి రాకుండా తనిఖీలు నిర్వహించడంతో పాటు అనుమానితులకు బ్రీత్‌ ఎనలైజర్‌ టెస్టులు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. కౌంటింగ్‌కు హాజరయ్యే సిబ్బందితో పాటు అభ్యర్థులు, ఏజెంట్‌లు ఎవరికీ సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదు.



కౌంటింగ్‌ కేంద్రంలోకి వెళ్లేందుకు బారులుతీరిన సిబ్బంది





కౌంటింగ్‌ కేంద్రం రైజ్‌ కాలేజీ వద్ద పహారా కాస్తున్న పోలీసు సిబ్బంది

కౌంటింగ్‌ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

- ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

పొదిలి: వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ కౌంటింగ్‌ ఏజెంట్లు ఓర్పు, సహనంతో అప్రమత్తంగా ఉండాలని, కృషికి తగిన ఫలితం పొందుతారని ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. స్థానిక వివేకానంద విద్యా సంస్థల సమావేశ హాలులో సోమవారం నిర్వహించిన కౌంటింగ్‌ ఏజెంట్ల అవగాహన సమావేశంలో మాట్లాడారు. భాస్కరరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల యుద్ధం చేసేవారిని మనకున్న శక్తితో ఎదుర్కోవచ్చని, కానీ ప్రత్యర్థి పార్టీలు రెచ్చగొట్టి యాగీ చేసి రచ్చచేయాలని చూస్తున్నారన్నారు. పార్టీ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి తమ విధి నిర్వహించాలన్నారు. ఏ అనుమానం ఉన్నా లిఖితపూర్వకంగా ఆర్వోకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎదుటివారు అనుక్షణం రెచ్చగొట్టే ప్రయత్నాలే చేస్తారని, సహనం పాటిస్తూ ఏ విషయమైనా వివాదం చేయకుండా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. వేకువజామునే లేచి ఆరు గంటల్లోపు కేంద్రం లోపలకు చేరాలని కోరారు. జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల మూలంగానే భారీ విజయం పార్టీ సొంతం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఏజెంట్లు అందరూ కౌంటింగ్‌ రోజున కౌంటింగ్‌పైనే దృష్టి పెట్టాలని, అభ్యర్థులు డిక్లరేషన్‌ ఫారం అందుకునేంత వరకు కేంద్రాల్లోనే ఉండాలన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ కౌంటింగ్‌ జరిగే విధానం, ఏజెంట్ల బాధ్యతల గురించి వివరించారు. ప్రధానంగా పోస్టల్‌ బ్యాలెట్ల విషయంలో ఏజెంట్ల పాత్ర గురించి తెలిపారు. ఎటువంటి అనుమానం వచ్చినా లిఖితపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అనవసరపు తగాదాలు, వివాదాలు లేకుండా చూడాలన్నారు. ఈవీఎంల సీల్‌ పరిశీలన, పోలైన ఓట్లు, అందరూ అభ్యర్థులకు నమోదైన ఓట్లు వేగంగా నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని పొలిటికల్‌ ఎనలిస్ట్‌ పుత్తా యర్రంరెడ్డి అన్నారు. పోలైన ఓట్లకు, అభ్యర్థులకు వచ్చిన ఓట్లకు తేడా ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ఏజెంట్లకు చెవిరెడ్డి ఐడీ కార్డుల కిట్‌ అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్‌ చైర్మన్‌ సత్యనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ.రమణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్‌ వై.వెంకటేశ్వరరావు, జిల్లాలోని ఎంపీ అభ్యర్థి కౌంటింగ్‌ ఏజెంట్లు పాల్గొన్నారు.



పాల్గొన్న ఏజెంట్లు

ఎక్కడికక్కడ బంద్‌

- నేడు ఒంగోలులో 144 సెక్షన్‌
- దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేతకు పోలీసుల ఆదేశాలు
- బార్‌లు, రెస్టారెంట్లు కూడా బందే



దుకాణాల మూసివేతతో నిర్మానుష్యంగా ఉన్న ఒంగోలు ట్రంకు రోడ్డు

ఒంగోలు టౌన్‌: సార్వత్రిక ఎన్నికల తుది ఫలితాలు నేడు వెల్లడికానున్నాయి. గత నెల 13న జరిగిన పోలింగ్‌ ఓట్ల లెక్కింపు జరగనుంది. ఒంగోలు పార్లమెంటుతో సహా జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజవర్గాల ఓట్ల లెక్కింపు ఒంగోలు నగర శివారులోని రైస్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో జరగనుంది. ఈ నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే ఒంగోలుతోపాటు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్‌ విధించారు. మంగళవారం ఓట్ల లెక్కింపు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. పట్టణం మొత్తం సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు. కొత్త వ్యక్తులు, అనుమానితులపై నిఘా ఉంచారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ మైకుల ద్వారా ప్రచారం నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దుకాణాలు, షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లను మూసి వేస్తూ ఎస్పీ గరుడ్‌ సుమిత్‌ సునీల్‌ ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్‌ నేపథ్యంలో ఒంగోలు నగరంలోని ప్రధాన కూడళ్లలో ఎస్పీ పర్యటించారు.

రెడ్‌జోన్‌గా రైజ్‌ కాలేజీ:

ఎన్నికల కౌంటింగ్‌ కేంద్రమైన రైస్‌ కాలేజీని రెడ్‌ జోన్‌గా ప్రకటించారు. అలాగే కౌంటింగ్‌ కేంద్రాన్ని నో ఆల్కహాల్‌ జోన్‌, నో స్మోకింగ్‌ జోన్‌గా కూడా ప్రకటించారు. కౌంటింగ్‌ కేంద్రంపై డ్రోన్లను ఎగరవేయకూడదని హెచ్చరికలు జారీ చేశారు. కౌంటింగ్‌ కేంద్రం వద్ద సీఏపీఎఫ్‌, యాక్సెస్‌ కంట్రోలు, ప్రధాన గేట్ల తనిఖీ, బందోబస్తు తదితర నాలుగంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌ కేంద్రానికి పరిసరాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లను మూసివేయాలని ఆదేశించారు. కౌంటింగ్‌ కేంద్రం వద్ద ఒక ఏఎస్పీ, నలుగురు డీఎస్పీల ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పెళ్లూరు, వల్లూరు గ్రామాల సమీపంలోని నేషనల్‌ హైవే 16పై ట్రాఫిక్‌ మళ్లింపు చేపట్టారు. ఇక్కడ పాయింట్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ మళ్లించారు. కౌంటింగ్‌కు వచ్చే అధికారులు, అభ్యర్థులు, చీఫ్‌ కౌంటింగ్‌ ఏజెంట్లు, ఏజెంట్లు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా పార్కింగ్‌ ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌కు హాజరయ్యేవారు మద్యం తాగి రాకుండా ఉండేందుకు ప్రవేశ ద్వారం వద్ద ర్యాండం బ్రీత్‌ఎనలైజర్‌ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎవరైనా ఏజెంట్లు అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే వారిని బయటకు పంపించేందుకు లిఫ్టింగ్‌ పార్టీని కూడా సిద్ధంగా ఉంచారు.

265 మందిపై రౌడీషీట్లు:

సబ్‌ డివిజన్‌ పరిధిలో 145 మంది, జిల్లాలో 265 మంది పై రౌడీ షీటు ఓపెన్‌ చేశారు. 29,048 మందిని బైండోవర్‌ చేశారు. కౌంటింగ్‌ సందర్భంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, హింసాత్మక చర్యలకు దిగినా రౌడీషీట్‌ తప్పదని పోలీసులు హెచ్చరించారు.

మద్యం దుకాణాల బంద్‌:

జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు మద్యం దుకాణాలను మూసి వేస్తూ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్‌ నేపథ్యంలో సోమవారం, మంగళవారం, బుధవారం మూడు రోజులు మద్యం దుకాణాలు మూత పడ్డాయి. తిరిగి 6 వ తేదీ మద్యం దుకాణాలు తెరిచే అవకాశం ఉన్నట్లు సమాచారం.

చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

ఒంగోలు నగరం, వన్‌టౌన్‌, టూ టౌన్‌, తాలుకా, కొత్తపట్నం, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో 144 సెక్షన్‌, ఏపీ 30 పోలీసు యాక్టు అమలులో ఉందని డీఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవరూ గుంపులుగా గుమిగూడవద్దని, గెలుపు సంబరాలు చేసుకోవడం, సోషల్‌ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడాన్ని నిషేధించినట్లు తెలిపారు. సబ్‌ డివిజన్‌ పరిధిలో 6 వ తేదీ వరకు వ్యాపార సంస్థలు, దుకాణాలు, షాపులను మూసి వేయాలని కోరారు. అల్లర్లు, హింసాత్మక సంఘటనలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే వెంటనే డీఎస్పీ సెల్‌:9121104796, ఎస్‌ఐ సెల్‌:9000694409, పోలీసు హెల్ప్‌ లైన్‌: 9121102242, ఫోన్‌ చేయాల్సిందిగా కోరారు.

ప్రశాంతంగా ఓపెన్‌ స్కూల్‌ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు: ఏపీ ఓపెన్‌ స్కూల్‌ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ఓపెన్‌ స్కూల్‌ పరీక్షల జిల్లా కోఆర్డినేటర్‌ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పదో తరగతి హిందీ పరీక్షకు 8 మందికిగాను ఆరుగురు హాజరయ్యారు. ఇంటర్‌మీడియట్‌ బయాలజీ పరీక్షకు 223 మందికిగాను 193 మంది, కామర్స్‌ పరీక్షకు 448 మందికిగాను 401 మంది వెరసి మొత్తం 671 మందికిగాను 594 మంది హాజరయ్యారని శ్రీనివాసరెడ్డి వివరించారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2.59 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,58,919 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్‌ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.82,180, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.45 వేలు, శాశ్వత అన్నదానం పథకానికి రూ.1,26,223, పంచామృత అభిషేకానికి రూ.5,516 అందజేశారన్నారు.

చెరువులో పడి బాలుడు మృతి


చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన బంగారు

కురిచేడు: మండలంలోని పడమర కాశీపురంలో పశువులకు నీరు తాపేందుకు చెరువుకు తోలుకెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి బాలుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..పడమర కాశీపురం గ్రామానికి చెందిన సాదం బంగారు(13)ఆదివారం తమ గేదెలను తొలుకొని పొలంవెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో నీళ్లు తాపేందుకు చెరువులోకి తీసుకెళ్లాడు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండింది. గేదెలు నీరు తాగేందుకు లోపలకు వెళ్లాయి. వాటిని బయటకు తోలే క్రమంలో ప్రమాదవశాత్తు బంగారు జారి చెరువులో పడిపోయాడు. బంగారుకు ఈత రాకపోవడంతో నీళ్లలో నుండి బయటకు రాలేక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు బంగారు మృతదేహాన్ని గాలించి బయటకు తీశారు. బంగారు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని నాయకులు సాదం నాసరయ్య, ముక్తిపూడి కిరణ్‌బాబు సందర్శించి నివాళులర్పించారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

కురిచేడు: మండలంలోని బోధనంపాడు గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన అబుదావలిని వేమా గోవింద రమేష్ బీర్‌బాటిల్‌లో దాడి చేసి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నిందితుడు వేమా గోవింద రమేష్‌ను సీఐ సూరేపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది అరెస్టు చేశారు. నిందితున్ని ఒంగోలులో కోర్టులో ప్రవేశపెట్టగా 15 రోజుల రిమాండ్ విధించడంతో ఒంగోలుకు జైలుకు తరలించినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

కిటకిటలాడిన ఒంగోలు

ఒంగోలు సిటీ: సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం అందరూ అత్రుతగా ఎదురుచూస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతో ఒంగోలు నగరం కిటకిటలాడుతుంది. మంగళవారం అభ్యర్థుల భవితవ్యం తెలియనుండటంతో అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఒంగోలులోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ కౌంటింగ్ కేంద్రంలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్‌కు కౌంటింగ్ జరుగుతుంది. నగరంలోని చిన్న హోటల్స్ నుంచి పెద్ద హోటల్స్ వరకు మూడు రోజుల ముందే గదులను బుక్ చేసుకున్నారు. చివరికి బంధువుల ఇళ్లల్లో కూడా మకాం వేసినట్లు సమాచారం. ఎక్కడా చూసినా పార్టీ నాయకులే దర్శనమిస్తున్నారు. రాజకీయపార్టీల గెలుపోటములపై భారీగా చర్చలు, బెట్టింగులు జరుగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో ఉండే రిసార్ట్‌లన్నీ బుక్ అయిపోయాయి. విజయోత్సవ సంబరాలు జరుపుకునేందుకు అన్ని పార్టీల నాయకులు ఒంగోలు నగరానికి తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని అందరూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, అశ్విని నక్షత్రం, ద్వాదశి తిథి సందర్భంగా మంగళవారం శింగరకొండలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెవవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం పంచ హారతుల పూజ, సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షాణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ, రాత్రి 7 నుంచి 7.45 గంటల వరకు ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

కౌంటింగ్ డ్రై రన్


మంగమూరు రోడ్డు వద్ద ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

- కౌంటింగ్ కేంద్రం వద్ద ట్రాఫిక్ మళ్లింపు
- పకడ్బందీగా భద్రతా చర్యలు
- పరిశీలించిన కలెక్టర్, ఎస్పీలు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నేడు జరిగే కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సోమవారం కౌంటింగ్ కేంద్రాల్లో కౌంటింగ్ సిబ్బందితో ఓట్ల లెక్కింపు డ్రై రన్ నిర్వహించారు. దీంతో పాటు కౌంటింగ్ కేంద్రం రైజ్ కాలేజి వద్ద ట్రాఫిక్ మళ్లించి భద్రతా చర్యలను పటిష్టం చేశారు. ప్రక్రియను కలెక్టర్ ఏఎస్‌దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పర్యవేక్షించారు. కౌంటింగ్ సూపర్ వైజర్‌లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లు, మైక్రో అబ్జర్వర్‌లతో సిద్ధం చేసిన ఈవీఎంలతో ఓట్ల లెక్కింపు డ్రై రన్ నిర్వహించి నేడు జరిగే కౌంటింగ్‌లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉండేలా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పలు సూచనలు చేశారు. కౌంటింగ్‌లో ప్రతి ఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కచ్చితమైన ఓట్ల లెక్కింపు నిర్వహించాలన్నారు. రీ కౌంటింగ్ లేకుండా ఉండేలా ఒకేసారి పారదర్శకంగా పక్కాగా ఓట్ల లెక్కింపు జరగాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మరింత అప్రమత్తత అవసరమన్నారు. కౌంటింగ్ కేంద్రం బయట నేషనల్ హైవేపై రైజ్ కాలేజికి రెండు వైపులా ట్రాఫిక్ మళ్లించి జాతీయ రహదారిపై ఒక రోడ్డుపైనే వాహనాల రాకపోకలు జరిగేలా నియంత్రించారు. అదేవిధంగా కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో పోలీసులను మోహరించి పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకున్నారు. ప్రాంగణం ప్రధాన గేట్ల వద్ద తనిఖీ చేసేందుకు మెటల్ డిటెక్టర్‌లు, బ్రీత్ ఎనలైజర్‌లు ఏర్పాటు చేసి తనిఖీ చేసేందుకు సిద్ధం చేశారు.


రైజ్ కాలేజీ కౌంటింగ్ కేంద్రం వద్ద మోహరించిన పోలీసులు

అప్రమత్తతతో ఎయిడ్స్ నియంత్రణ

- మార్కాపురం జీజీహెచ్ సూపరింటెండెంట్ సావిత్రి
- హెచ్ఐవీ బాధితుల కోసం ఇండెక్స్ టెస్టింగ్ హెల్పింగ్ డెస్క్ ప్రారంభం


ఇండెక్స్ టెస్టింగ్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి, పక్కన అధికారులు, సిబ్బంది

మార్కాపురం: అప్రమత్తతతోనే ఎయిడ్స్ వ్యాధిని నియంత్రించవచ్చని మార్కాపురం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఏపీ సాక్స్), డాప్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ కేంద్రంలో ఇండెక్స్ టెస్టింగ్ హెల్పింగ్ డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఐవీ బాధితుల జీవిత భాగస్వాములకు వారి పిల్లలకు ఏఆర్‌టీ కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు వినియోగించుకోవాలని సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, సి.సాయికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఆర్‌టీ కేంద్రంలో మందులు వాడుతున్నవారి జీవిత భాగస్వాములు, వారి పిల్లలు హెచ్ఐవీ స్థితిని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా సమయం ఆదా చేసి, శ్రమ తగ్గించేందుకు ఏఆర్‌టి కేంద్రంలోనే ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించే ఇండెక్స్ టెస్టింగ్ డెస్క్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ రామచంద్రరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏఆర్‌టీ కౌన్సిలర్లు ఎం.పోతురాజు, ఎం.రామారావు, కె.మహాలక్ష్మీ, రాజు, పి.లక్ష్మీరెడ్డి, మహేశ్వరి, లక్ష్మీదేవి, డేటా మేనేజర్లు శ్రీనివాసులు, ఎస్.మురళి, విహాన్ ఓఆర్‌డబ్ల్యు చంద్రావతి, వైఆర్‌జీ కేర్ లక్ష్మీ, సీహెచ్ఎస్ నరేష్, షెరిండియా డేటా ఆపరేటర్ ఎం.వెంకటేశ్వర్లు, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండండి

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు మంత్రి సురేష్ దిశానిర్దేశం


కొండపి కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ: సార్వత్రిక ఎన్నికల్లో చివరిఘట్టం అయిన కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సూచించారు. స్థానిక రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ.. కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఎప్పటికప్పుడు ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో జాగ్రత్తగా లెక్క రాసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏ విధంగా వ్యవహరించాలో, ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో ఏజెంట్లకు అర్థమయ్యేలా వివరించారు. కొండపి గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన అప్లికేషన్ ఫారాలు అందజేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన ఇసుక మాఫియా

- పాలేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా
- ఇసుక తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం
- మూడు ట్రాక్టర్లు, మరో టిప్పర్‌తో నిందితులు పరార్
- దాడి చేసిన రెవెన్యూ అధికారులకు బెదిరింపులు


కామేపల్లి వద్ద సీజ్ చేసిన టిప్పర్‌తో రెవెన్యూ సిబ్బంది

జరుగుమల్లి(సింగరాయకొండ): ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ సిబ్బంది సీజ్ చేసిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరుగుమల్లి మండలంలోని కామేపల్లి-సతుకుపాడు గ్రామాల మధ్య చోటుచేసుకుంది. ఆర్ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తహసీల్దార్ చక్రవర్తి ఆదేశాల ప్రకారం ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఒక టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, సిబ్బంది గ్రూపులుగా ఏర్పడి మరో మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టుకునే ప్రయత్నం భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు దాడికి యత్నించి పరారయ్యారని పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ రావూరి రవి, జేసీబీ యజమాని పిడికిటి శ్రీనివాసులు, టిప్పర్ డ్రైవర్ సింహఫణిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్సై వెంకటేశ్వర్లుకు సిఫార్సు చేసినట్లు ఆర్ఐ రమణయ్య చెప్పారు.


సర్వీస్ ఓట్ల లెక్కింపులో పాల్గొన్న రాజకీయపార్టీల ప్రతినిధులు

సర్వీస్ ఓట్లు రైజ్ కాలేజీకి తరలింపు

ఒంగోలు సిటీ: 3495 పార్లమెంట్ సర్వీస్ ఓట్లను రైజ్ కాలేజీకి తరలించినట్లు జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.ఝాన్సీలక్ష్మీ తెలిపారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ ఛాంబర్‌లో రాజకీయా పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మీ మాట్లాడుతూ జూన్ 3వ తేదీన ఒంగోలు పార్లమెంట్‌కు సంబంధించిన 1514 సర్వీస్ ఓట్లు వచ్చినట్లు తెలిపారు. వచ్చిన సర్వీస్ ఓట్లను సీసీ కెమెరా, ప్రభుత్వ వీడియో సమక్షంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపించి ఎన్ని వచ్చాయో లెక్కించి పోస్టల్ బ్యాలెట్ బాక్సులో వేసి సీలు వేసినట్లు తెలిపారు. మొత్తం 6693 సర్వీస్ ఓట్లకు గాను 3వ తేదీ సోమవారం నాటికి 3495 ఓట్లు వచ్చినట్లు తెలిపారు. వీటిని పోలీస్ ఎస్కార్ట్‌తో లెక్కింపు కేంద్రమైన రైజ్ కాలేజీకి తరలించినట్లు పేర్కొన్నారు. జూన్ 4వ తేదీ వచ్చే సర్వీస్ ఓట్లు రైజ్ కాలేజీలో ఉదయం 8 గంటల లోపు రిసీవ్ చేసుకుంటారని తెలిపారు. 8 నియోజకవర్గాలకు సంబంధించిన ప్రతి అసెంబ్లీ ఆర్వో ఉన్న పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కింపు కేంద్రమైన రైజ్ కాలేజీకి వచ్చినట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రైజ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచి సీలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు హెడ్ పోస్టుమాస్టర్ రాజేశ్వరి, డివిజనల్ పోస్ట్ ఆఫీస్ ఏఎస్పీ మాధుసూదన్‌రావు, వైఎస్సార్ సీపీ నుంచి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల నుంచి గుర్రం సత్యం, దేవిరెడ్డి రామాంజనేయులు, ఏడుకొండలు, కొండారెడ్డి, సూర్య, యర్రయ్య, సినారెడ్డి, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నైరుతి ఆగమనం!

- ఆవర్తన ప్రభావంతో చల్లబడిన వాతావరణం
- జిల్లాలో పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు
- 24 మండలాల్లో వర్షపాతం నమోదు


కొనకనమిట్ల : కోతకు గురైన కలవలపల్లి వెళ్లే రోడ్డు

ఒంగోలు సెంట్రల్: నైరుతి రుతుపవనాల రాక, ఆవర్తన ప్రభావంతో జిల్లాలో వాతావరణం చల్లబడటంతోపాటు 23 మండలాల్లో 446 మి.మి వర్షపాతం నమోదైంది. కొద్ది రోజులుగా తీవ్రమైన వేడి గాలులు, ఉక్కపోతతో విలవిల్లాడుతున్న ప్రజలు, వృద్ధులు చల్లబడిన వాతావరణంతో ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. త్రిపురాంతకంలో 75.6 మి.మీల, పుల్లలచెరువు 60, కురిచేడు 46.4, కంభం 36.8, తర్లుపాడు 31.2, బేస్తవారిపేట 29.4, మార్కాపురం 24.0, పెద్దారవీడు 18.6, దోర్నాల, గిద్దలూరులలో 12.8, హెచ్ఎం పాడు 12.2, ఎన్‌జీ పాడు 11.6, కొత్తపట్నం 9.8, దొనకొండ 8.8, ముండ్లమూరు 6.2, ఒంగోలు, ఒంగోలు అర్బన్ 5.6, మద్దిపాడు 5.4, యర్రగొండపాలెం 5.2, రాచర్ల 5.0, కొనకనమిట్ల 4.4, తాళ్లూరు 4.2, దర్శి 2.2, కొమరోలు 1.8 మి.మీ వర్షం కురిసింది. జిల్లా సరాసరి వర్షపాతం 11.4 మి.మీగా నమోదైందని అధికారులు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- డీఈఓ సుభద్ర


మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

ఒంగోలు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత కావాలని డీఈఓ డి.సుభద్ర పిలుపునిచ్చారు. స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో సోమవారం వివిధ విభాగాల సమన్వయకర్తలు, అధికారులతో సమీక్షించారు. పెరుగుతున్న భూతాపాన్ని నివారించేందుకు చెట్లను పెంచడంతో పాటు ఏసీల వాడకం గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్య సమితి అనుబంధంగా ఇంటర్ ప్యానల్ ఇన్ క్లైమేట్ ఛేంజ్(ఐపీసీసీ) పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు నిర్దేశించిందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను చైతన్యం చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఈనెల 5 నుంచి 19వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికి సంబంధించి రోజువారీ ఏయే కార్యక్రమాలు నిర్వహించాలనే దానిపై షెడ్యూల్ విడుదలచేశారు. సమీక్షలో విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యన్నారాయణ, డీఎల్‌పీఓ ఆర్.పాదం, ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ జి.రాఘవరెడ్డి, వై.భాస్కరవర్మ, కాలుష్య నియంత్రణ మండలి అధికారి వై.భాస్కరవర్మ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేష్ 'ఓటు' విడుపు!

- ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి షటిల్ బ్యాడ్మింటన్
- పార్టీ శ్రేణులతో సరదాగా గడిపిన మంత్రి


ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ: స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఇండోర్ స్టేడియంలో సోమవారం ఉదయం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ షటిల్ బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఎన్నికల అనంతరం మోకాలి చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లిన మంత్రి.. ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ ఆడి మానసిక ఉల్లాసాన్ని పొందారు. తరువాత పార్టీ నాయకులు, కార్యకర్తలతో సరదాగా గడిపారు. మంగళవారం కౌంటింగ్‌లో గెలుపు తనదేనన్న ధీమా ఆయనలో కనిపించింది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఎలా ఉన్నా కొండపి నియోజకవర్గం ఓటరు నాడి తనకు తెలుసని, కొండపి గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కొండపి నియోజకవర్గాన్ని ముఖ్యంగా సింగరాయకొండను మున్సిపాలిటీగా చేయడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టి ఉత్తమ పట్టణంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు సోమిశెట్టి సురేష్, గాదంశెట్టి గుప్తా, గాదంశెట్టి విజయ్, సయ్యద్ ఆబిద్ ఆలీ, చుక్కా కిరణ్‌కుమార్, కుమార్, షేక్ అల్లాభక్షు, ఖాసిం, మణి, చిడిపోతు కృష్ణారెడ్డి, షేక్ గౌస్, శ్రీనివాసులరెడ్డి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్‌లో పొదిలి విద్యార్థుల సత్తా


షీల్డ్ అందుకుంటున్న విఘ్నేష్, శ్రీవల్లి

పొదిలి: రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పొదిలి పిల్లలు సత్తా చాటారు. గుంటూరు లాంలో చలపతి ఫార్మాస్యూటికల్ కళాశాలలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి చెస్ పోటీల్లో అండర్-07 విభాగంలో జవ్వాజి విఘ్నేష్(రాష్ట్ర స్థాయి రెండో స్థానం), జవ్వాజి పాణ్య శ్రీవల్లి(రాష్ట్రస్థాయి నాలుగో స్థానం) ప్రతిభ చూపారు. పొదిలిలో బ్యాంకు మేనేజరుగా పనిచేస్తున్న సునీల్ గుప్తా, హారిక దంపతుల కుమార్తె శ్రీవల్లి, కుమారుడు విఘ్నేష్ స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో 3, 2వ తరగతి చదువుతూ చెస్‌లో ప్రావీణ్యం సంపాదించారు. తండ్రి సునీల్ గుప్తా వారికి గురువులా మారి చెస్ నేర్పిస్తుండటం విశేషం. ఇద్దరు చిన్నారులకు పాఠశాల ఉపాధ్యాయులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

నరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2.15 లక్షలు


హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీ ఆదాయం 2,15,224 రూపాయలు వచ్చిందని ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. మార్చి ఒకటో తేది నుంచి జూన్ 3వ తేదీ వరకు వచ్చిన కానుకలను సోమవారం కందుకూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో లెక్కించినట్లు పేర్కొన్నారు. అలాగే గత ఏడాది జనవరి 1వ తేదీ నుంచి మే 16వ తేదీ వరకు హుండీ ఆదాయం రూ.3.69 లక్షలు వచ్చినట్లు వివరించారు. ఆలయ దేవస్థాన కమిటీ సభ్యులతోపాటు ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరసింహాచార్యులు, ఉదయగిరి లక్ష్మీ నరసింహాచార్యులు, మట్టా సుబ్బారావు పాల్గొన్నారు.

వేలం ఆదాయం రూ.1.55 లక్షలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయలు విక్రయించుకోవడానికి నిర్వహించిన వేలం ద్వారా రూ.1.55 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ కృష్ణవేణి తెలిపారు. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ అమ్ముకోవడానికి ఎవరు ఆసక్తి చూపకపోవడంతో వేలం నిలిపేసినట్లు వెల్లడించారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.